# ఈగ

## వసుంధర

ఎంపీ సోమలింగం చిన్నతనంలో చాలా కష్టపడ్డాడు. పైకి రావాలని పట్టుదలగా చదువుకున్నాడు. కాస్త పైకి రాగానే కష్టజీవులందర్నీ ఆకట్టుకుని మరికాస్త పైకి వెళ్లాడు. ఎంపీ అయ్యాడు.

సోమలింగానికిప్పుడు కష్టాలులేవు. పెద్ద ఇల్లుంది. తాతా-బామ్మా, తండ్రీ-తల్లీ, పెళ్లాం-కొడుకు ఆ ఇంట్లోనే వుంటున్నా ఇంకా ఆ ఇల్లు పెద్దదే. ఆ ఇంట్లో ఏ ఒక్కరికీ కష్టమంటే తెలియదు.

తనకిది పునర్జన్మలా వున్నా గత జన్మను మరచిపోరాదని సోమలింగం ఓ చిన్న మట్టి గుడిసె కట్టించి ఆ బొమ్మను షో పీసుగా డ్రాయింగ్‌రూంలో ఒక మూల వుంచాడు. ప్రతి సోమవారంనాడూ నిద్ర లేవగానే ఆయన స్వయంగా ఆ ఇంటిని అలుకుతాడు. ఏడాదికొకసారి తన పుట్టినరోజున జర్నలిస్టుల ముందా ఇల్లలికి ప్రశంసలందుకుంటాడు. ఇల్లలికే ఎంపీగా కొందరాయన గురించి చెప్పుకుంటారు.

ఒక సోమవారం సోమలింగం ఇల్లలుకుతున్నాడు. అంతలో జేబులోని సెల్యులార్ మ్రోగింది. చేతులు కడుక్కుని తుడుచుకుని సందేశం విన్నాడు.

''అర్జంటుగా మా పార్టీలో చేరాలి. పదిలక్షలదాకా ఇస్తాము. బేరాలులేవు. సాయంత్రం మళ్లీ ఫోన్ చేస్తాం. అప్పటిదాకా ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పు''

సోమలింగం హుషారుగా భార్య దగ్గరకు పరుగెట్టాడు. ఇల్లలికే పని లేదు కాబట్టి ఆమె ఇంకా నిద్రపోతోంది. సాధారణంగా ఆయన భార్యకు నిద్రాభంగం చేయడు. ఎందుకంటే ఆమె నిద్రపోతూ కలలు కంటూ గత జన్మలోకి వెళ్లిపోతుంది. ఇన్నేళ్లుగా కొత్త జీవితంలో వున్నప్పటికీ కలల్లో మాత్రం గత జన్మ తప్పదామెకు. నిద్ర మధ్యలో లేపితే ఆమె గత జన్మలో భాషనే మాట్లాడుతుంది. సరదాకు ఇల్లలుకుతాడుగానీ క్షణమాత్రమైనా ఆ భాషను పెళ్లాం నోటివెంట వినాలన్న సరదా మాత్రం ఆయనకులేదు.

ఇప్పుడు మాత్రం అన్నింటికీ సిద్ధపడే ఆయన ఆమెనులేపి గత జన్మలోని భాషలోకి దిగేలోగా ''నీకు పదిలక్షలిస్తా. ఏం చేసుకుంటావో చెప్పు'' అంటూ హిప్నటైజు చేసి వాస్తంలోకి తెచ్చాడు.

''కోనసీమ తుపాను ధాటికి తట్టుకోలేక బక్కరైతులు కొందరు అయిన కాడికి భూములమ్ముకు పోతున్నారట. పదిలక్షలకూ పదెకరాలకు తక్కువ రావు. మనకక్కడ సెంటు భూమి కూడా లేదు'' అందామె.

అంత మంచి సలహా ఇచ్చిందని ఆయనకు భార్య ముద్దొచ్చింది. అయినా ఆమెతో ఆ క్షణంలో నిద్రాభంగం కారణంగా కొన్ని గత జన్మ వాసనలింకా మిగిలి ఉండడంవల్ల దగ్గరగా తీసుకోలేక పోయాడు. అంతలోనే ''అవునూ అంత డబ్బెక్కడిది?'' అని కుతూహలంగా అడిగి, జవాబు రాగానే ''ఓరినీ..''అని తమాయించుకుని ''పార్టీ మారడానికి బొత్తిగా పదిలక్షలా, ఇవేమైనా ఇందిరమ్మ రోజులా. కోటికి తగ్గనని తెగేసి చెప్పాల్సింది'' అందామె.

''అబ్బే... అవి పీవీగారి రోజులు. అయినా ఇప్పుడు సీజనూ కాదు. ఏ మెజారిటీ లేకుండానే యునైటెడ్ ఫ్రంట్ దేశాన్నేలేస్తోంది. వాళ్లని చెడ తిట్టేవాళ్లే కానీ పడగొట్టేవాళ్లు కనబడరు. అంతో ఇంతో చేయగల బీజేపీకి ఆ పనికి ఒకళ్లూ ఇద్దరూ చాలరు. ప్రస్తుతం ఎంపీలకు గిరాకీ లేకుండా పోయింది. పదిలక్షలేంటి పదివేలిస్తే పుచ్చుకోవాల్సిందే. మనకా శ్రమలేని పని. ఉత్తినే వచ్చేది కాదనడమెందుకు?'' అన్నాడు సోమలింగం.

''శ్రమ లేదంటున్నావు. మరి నీ పార్టీ వాళ్లూరుకుంటారా? అదేదో చట్టముందిగా'' అందామె.

అదంటే యాంటీ డిఫెక్షన్‌లా. పార్టీ మారాలంటే కనీసం మూడొంతుల మందిని కూడగట్టుకోవాలి. ఆ మూడొంతులూ ఎవరెవరా అని ఆలోచించబోయి గతుక్కుమన్నాడు సోమలింగం. ఆయనకు తనే పార్టీయో గుర్తుకు రాలేదు. అందుకని నర్మగర్భంగా ''నా పార్టీవాళ్లంటున్నావ్. అసలు నేనే పార్టీనో నీకెరుకా?'' అన్నాడు భార్యను సవాలు చేస్తూ.

''పదేళ్లక్రితందాకా ఫర్వాలేదు. గుర్తుండేది. ఇప్పుడంటావా? భోగం దాని తండ్రెవరో చెప్పవచ్చుగానీ నీ పార్టీ ఏంటో చెప్పడం నావల్లకాదు. ఈ వేళున్నది రేపుండదు కదా. అసలు నీ పార్టీయేదో నీకు తెలుసా అని'' అందామె అనుమానంగా.

''నీ దగ్గర దాపరికమెందుకు? నా పార్టీ మరచిపోయాను. నీకు గుర్తుంటే చెప్పవే వేధించక'' అన్నాడు సోమలింగం బతిమాలుతూ.

''అయితే వెళ్లి నీ అమ్మనడుగు. ఆవిడ మహా ఆరాల మనిషి. అన్నీ తెలుస్తాయి'' అంటూ ఆవులించిందామె. ఆమె మేను వాల్చి కన్ను మూసుకోగానే సోమలింగం తల్లి వద్దకు వెళ్లాడు.

కొడుకు పైకొచ్చాక కాఫీ అలవాటయింది సోమలింగం తల్లికి. ఆ కాఫీ కోసం ఆవిడ పెందరాళే నిద్ర లేస్తుంది. కొడుకు

**కథలపోటీ హాస్యం విభాగంలో కన్సొలేషన్ బహుమతి (రూ.1,250) కథ**



వచ్చే సమయానికి ఆవిడ రెండో ట్రిప్పు కాఫీ తాగుతోంది.

''వెధవకానా! నువ్వు నా పార్టీయో, నీ బామ్మ పార్టీయో తెలియనివ్వకుండా ఇన్నేళ్లు గడిపావు. నన్ను బయటి పార్టీ గురించి అడుగుతావా?'' అని మందలించిందావిడ.

ఆవిడకు తెలియనిదీ తండ్రికీ తెలియదని తెలుసుకాబట్టి తాత దగ్గరకు వెళ్లాడు సోమలింగం. అప్పుడు తాత స్నానం పూర్తి చేసుకుని గాంధీగారి ఫోటోకి దణ్ణం పెట్టుకుంటున్నాడు. ఆయన దృష్టిలో గాంధీ ఒక్కడే దేవుడు. మనవడు పార్టీ గురించి అడగ్గానే 'కాంగ్రెస్' అన్నాడాయన. ఆయనకు తెలిసినంతవరకూ దేశంలో వున్న పార్టీ అదే. అదొక్కటే.

ఎప్పుడూ తాతతో వాదనకిష్టపడని సోమలింగం ఆ రోజు మాత్రం కాస్త చిరాకుపడి ''అలాగంటావేమిటి? ఇంకో పార్టీయే లేనట్టు. దేశంలో కాంగ్రెస్ ఒక్కటే పార్టీ అయితే మరి వీళ్లంతా ఏ పార్టీ?'' అంటూ ఇతర పార్టీల్లో వున్న ప్రముఖ గాంధేయవాదుల పేర్లు చెప్పాడు.

''కాంగ్రెస్'' అన్నాడు తాత. మరి వాళ్లంతా ఒకప్పుడు కాంగ్రెసేనని గుర్తించిన

సోమలింగం ఉక్రోషం పెరిగి పోగా ''మరి మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరంటావ్?'' అన్నాడు సంచలనాత్మకమైన ప్రాంతీయ పార్టీనైనా ఆయన గుర్తిస్తాడని.

''కాంగ్రెస్'' అన్నాడు తాత.

ఆగిపోయిన గడియారం రోజుకు రెండుసార్లు కరెక్టుగా టైము చూపిస్తుంది. కాంగ్రెస్ పేరు చెప్పడం చాలామంది రాజకీయ నాయకుల విషయంలో అటువంటిదే! ఎటొచ్చీ అది కాంగ్రెస్ గొప్పతనం కాదు, మన దేశ రాజకీయానికి పట్టిన దౌర్భాగ్యం.

తాతకు తెలిసింది తప్ప బామ్మకింకేమీ తెలియదని తెలుసుకాబట్టి సోమలింగం ఇంట గెలువలేక రచ్చ గెలవాలని విశ్వనాధానికి ఫోన్ చేసాడు.

విశ్వనాధం ఆయనకు చిన్ననాటి స్నేహితుడు. సోమలింగం పైకొచ్చినందువల్ల ప్రయోజనాలు పొందుతూ సంతోషిస్తున్నాడు. సోమలింగంలో గొప్ప తనముంటే పొగుడుతాడు. లేకున్నా పొగుడుతాడు. లోపాలు మాత్రం చెప్ప డు. రాజకీయంలో స్నేహమంటే అదే కదా.

''నాకు తెలిసింది నువ్వే. నీ పార్టీ కాదు. నాకు మనిషి శాశ్వతం. పార్టీకాదు. ఇప్పుడు ప్రజలంతా నాలాగే వున్నారు. వాళ్లకూ మనుషులే తప్ప పార్టీలు తెలియవు. అందుకే ఓట్లు కూడా పార్టీలకు బదులు మనుషులకు వేస్తున్నారు. అంతగా నీకు నీ పార్టీ పేరు కావాలంటే నీ నాయకుడెవరో చెప్పు. నాయకులకు పార్టీలుంటాయి కాబట్టి చెప్పడం సులభం?'' అన్నారాయన.

''అయ్యో! నా నాయకుడెవరో గుర్తుంటే ఈ ఇబ్బందంతా ఎందుకు?''

''పార్టీ పేరు గుర్తు లేకపోయినా నాయకుడి పేరు గుర్తుందని వాళ్లన్నారంటే ఆశ్చర్యమే! అయినా రోజులు మారిపోతున్నాయిలే'' అని ఆగి ''పాత

## కథలపోటీ హాస్యవిభాగంలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథా రచయిత్రి వసుంధర

నాపేరు జొన్నలగడ్డ రామలక్ష్మి. భర్త రాజగోపాలరావు. నేను గృహిణిని. వారు భువనేశ్వర్ (ఒరిస్సా) రీజనల్ రీసెర్చి లాబరేటరీలో డిప్యూటీ డైరెక్టరు. 28 సంవత్సరాలుగా ఒరిస్సాలో ఉంటున్నాం కాబట్టే ప్రవాసులం. అన్ని సంవత్సరాలూ ప్రతి ఏటా ఏదో ఒక తెలుగు పత్రికలో ఎన్నో కొన్ని కథలు ప్రచురిస్తూనేవస్తున్నాం కాబట్టే ఆంధ్రులం. మా యిరువురికీ కలంపేరు వసుంధర. క్షణం తీరికలేని జీవితం మాది. కథలపోటీలే మాచేత తరచుగా కలం పట్టించి మా హాబీని నిలబెడుతున్నాయి. కథలపోటీలు నిర్వహించే పత్రికలన్నింటికీ మా కృతజ్ఞతాంజలులు. మా అమ్మాయి రాజకుమారి వివాహిత. సంగీతంలో కృషి చేస్తోంది. మా అబ్బాయి అమెరికాలో రీసెర్చి చేస్తున్నాడు. రచనలు చదివేవారికి మా రచనలే మా పరిచయం. చదువనివారికి సరిపడే పరిచయ వాక్యాలిక్కడ వ్రాసి వున్నాము. ప్రచురణలో ప్రోత్సాహం, పోటీలో ఉత్సాహం, బహుమతిలో సంతోషం ప్రసాదించిన ఆంధ్రభూమి నిర్వాహకులకు ధన్యవాదాలు చెప్పుకుంటూ...

వసుంధర ★

దినపత్రికలు తిరగేయ్. వాటిలో నీ నాయకుడికి మద్దతునిస్తూ నువ్విచ్చిన స్టేట్‌మెంట్లుంటాయి'' అన్నాడు విశ్వనాథం.

''ఆ పని నాకోసం నువ్వు చేసి పెట్టగలవా?''

''నేను పేపరు కొని చదవనని నీకు తెలుసుగా''

అంతటితో విశ్వనాథాన్ని విడిచిపెట్టి దినపత్రికలకోసం ఇంట్లో చాలాచోట్ల వెదికి వెదికి ఎక్కడా కనబడకపోగా మరి కొడుకును నిద్ర లేపక తప్పదనుకున్నాడు.

ఆరోజు స్కూలుకు సెలవు. సెలవుపూట సోమలింగం పుత్రరత్నం పదింటిలోగా నిద్ర లేవడు. ఆయనకూ ఇష్టముండదుగానీ వాడొక్కడికే దినపత్రికలపై ఆసక్తి. వాడు వాటిమీద వచ్చే మంచి బొమ్మలు కనబడేలా పుస్తకానికి అట్టలు వేసుకుంటాడు. ఇంక ఇంట్లో వాళ్లెవరూ పేపరు చదవరు, చూడరు.

సోమలింగాన్ని పడగగది గుమ్మం ముందు ఆపేసాడు అంగరక్షకుడు భీమయ్య.

భీమయ్య భీముడిలాగే వుంటాడు. ఇంట్లో పుత్రరత్నంమీద ఈగ కూడా వాలనివ్వడు. అందుక్కారణముంది. తండ్రి ఎంపీ మాత్రమే అయ్యాడుగానీ తను దేశానికి పిఎం కాగలనని వాడి నమ్మకం. అందుకని ఇతనికి అంగరక్షకుడ్ని అలవాటు చేయమన్నాడు. బయటైతే బాగుండదని నిండా పదేళ్లు లేని పుత్రరత్నానికి ఇంట్లో భీమయ్యను ఏర్పాటు చేసాడు సోమలింగం. ఆ భీమయ్య ఇప్పుడాయన్నే ఆపేసాడు.

''నేను వాడి తండ్రిని'' అన్నాడు సోమలింగం.

''నా బాస్ నిద్ర పోతున్నప్పుడు ఆ దేవుడే స్వయంగా దిగి వచ్చినా సరే నాకు ఈగలాగే కనిపిస్తాడు. ఈగల్ని నా బాస్‌మీద వాలనివ్వను'' అన్నాడు భీమయ్య. వాడు, పుత్రరత్నం కలిసి వచ్చిన ప్రతి సినిమా చూస్తారు. సినిమా డైలాగులు ఇద్దరికీ బాగా వంటబట్టాయి.

''పోనీ గదిలో దినపత్రికలేమైనా వుంటే ఇవ్వు'' సోమలింగం అసహాయత.

''నా బాస్ చిన్న కుర్రాడా ఏమన్నావా? పదేళ్లొచ్చాయి. గదిలో సినిమా పత్రికలు తప్ప ఇంకేమీ వుండవు'' భీమయ్య నిరసన.

''కాబోయే రాజకీయ నాయకుడు కనీసం దినపత్రికలన్నీ గదిల్లోనైనా వుంచుకోవాలిగదా'' అని ఆయన వాపోతే ''రాజకీయ నాయకుడు కావాలనే సినిమాలు చూసేదీ, సినిమా పత్రికలు చదివేదీనూ. రాజకీయాల్లో, సినిమాల కున్న భవిష్యత్తు వేటికీలేదు'' అన్నాడు భీమయ్య.

సినిమాలతోపాటు ప్రజల బానిస మనస్తత్వమూ విజృంభించినా ప్రయోజనంలేని తెలివినీ సంతరించుకున్నారని సోమలింగానికి మరోసారి అనుభవమయింది. పుత్రరత్నం గదిలో ప్రవేశించడానికి మరో ప్రయత్నం చేద్దామంటే భీమయ్య మళ్లీ ఈగ ప్రసక్తి తెస్తాడేమోనని భయంగా వుందాయనకి. అసలే ఇల్లలుకుతూ పార్టీ పేరు మర్చిపోయి వున్నాడు.

వెనుదిరిగిన సోమలింగానికి ఇల్లూడుస్తున్న చంద్రం కనిపించాడు. వాడికి ఇరవై ఏళ్లు. మహా చురుకు. చదువంటే పిచ్చి. ఎక్కడేం కనిపించినా చదివేస్తుంటాడు. వాడికి తెలివీ కాస్త ఎక్కువే. పేదవాడికి అంత తెలివి ప్రమాదమనుకుని హర్షుడికి పండితులు మినుము, దొండా పెట్టినట్టు వాడి తండ్రి వాడిని, ఎంపీ ఇంట్లో పనికి పెట్టాడు. ఆ ఇంట్లో వాళ్లతో మాట్లాడి మాట్లాడి అప్పటికే వాడి తెలివి సగానికి సగం తగ్గిపోయింది.

''దినపత్రికలెక్కడరా?'' అన్నాడు సోమలింగం. ఒకటి కాదు రెండుకాదు ఆ ఇంటికి అన్ని దినపత్రికలు ఫ్రీగా వచ్చే ఏర్పాటయింది.

''వాటినిండా తమరినో, తన స్నేహితుల్నో తిడుతూ వార్తలూ, కార్టూన్ బొమ్మలూ వుంటున్నాయని అమ్మగారికోపం వచ్చి షాహుకారుతో ఏర్పాటు చేసుకున్నారండి. ఇంగ్లీషు, తెలుగు అన్ని పేపర్లకూ కలిపి నెలకు ఇరవై కిలోలకు లెక్కకట్టి ఆయన డబ్బు పంపించేస్తాడండి. పేపర్లు నేరుగా ఆయనింటికే వెళ్లిపోతున్నాయండీ'' అన్నాడు చంద్రం.


ఈ ఏర్పాటెప్పట్నించో సోమలింగానికి తెలియదు. ఆయన పేపరు చూసి మూణ్ణెల్లయింది. అందుకని ''అది తప్పురా. పేపర్లనింటికి రానివ్వాలి. అందులో మన శత్రువుల్ని తిట్టినవి దాచుకోవాలి. మనని తిట్టినవే అమ్మాలి'' అన్నాడు.

''కొన్నాళ్లదీ చేసారు అమ్మగారు. కానీ అంతా కలికాలం కదండీ. ప్రతి రెండేసి రోజులకీ మిత్రుడు శత్రువవుతున్నాడు. శత్రువు మిత్రుడౌతున్నాడు'' అన్నాడు చంద్రం.

''పోనీలే. అమ్మగారి ఏర్పాటే బాగుంది'' అన్నాడు సోమలింగం. తన భార్య పేపరు చదవదనీ, పేపరు చదివిన ఉత్సాహంలో తన భావాలను చంద్రం ఆమెతో పంచుకోగా ఏర్పడిన పరిణామమే అదనీ ఆయన గ్రహించాడు. కాస్త చదివే ఇన్ని తెలుసుకున్నాడు. వాడిలాంటి వాడ్ని పేపరు చదవకుండా ఆపగల ఏ ఏర్పాటైనా మంచిదేనని ఆయనకు అనిపించింది.

ఇక తప్పనిసరై తనకు బాగా కావాల్సిన జర్నలిస్టు భరత్‌కి ఫోన్ చేస్తే ''నీకే సందేహమున్నా అడుగు నాయనా. ఈ సర్వజ్ఞయోగి వెంటనే బదులిస్తాడు'' అవి బదులిచ్చింది.

సర్వజ్ఞయోగి స్టార్ హోటల్లో దిగాడు. ఊళ్లోకి వచ్చి నాలుగు రోజులైంది. ఇంకా పదిరోజులుంటాడు.



### సైఫ్ ఖాన్ బాడ్‌లక్!

ఆమధ్య సినిమా తర్వాత సినిమాలో నటించి పారేసిన సైఫ్ ఖాన్ నటించిన సినిమాలు ఏవీ హిట్ కాలేదు. దాంతో అతనంటే ఇప్పుడు నిర్మాతలు పారిపోతున్నారట. అతన్ని ముందుగా బుక్ చేసినవాళ్లు సైతం మరో హీరోని రీప్లేస్ చే సుకోడానికే ఇష్టపడుతున్నా రట. దాంతో పాపం డీలాపడి పోతున్నాడు సైఫ్. పైగా అమృ తా సింగ్‌తో కూడా అతనికి గొడవలు వచ్చి చికాకుల్లో వున్నాడని బాలీవుడ్ సినీ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. ఎవరికైనా బాడ్ టైమ్ అనేది ఒక్కోసారి తప్పదు. పాపం సైఫ్ ఖాన్ మళ్లీ మంచి రోజులెప్పుడో?

-జె.ఎం.

ఎవరినీ స్వయంగా కలవనివ్వడు. ప్రశ్నలూ, జవాబులూ ఫోన్లోనే. నిన్నా మొన్నా ఆయనకోసం ఎంతో ట్రై చేసాడు. ఎంగేజ్ వచ్చింది. ఇప్పుడు రాంగ్ నెంబర్ రూట్లో ఆయన దొరికాడు. పోనీ ఇదీ ఒకందుకు మంచిదే అనుకుని ఆయనకు తన అవస్థ చెప్పుకున్నాడు. ఆయన గంభీరంగా ''నా అభిప్రాయంలో మతాలెన్ని వున్నా దేవుడొక్కడే. పేర్లు వేరైనా పార్టీలన్నీ ఒక్కటే. అయినా నీకో ఉపాయం చెబుతాను. ఆదర్శాలు, ఆచరణ, విధానాలనుబట్టి మతాలను గుర్తించవచ్చు. అలాగే పార్టీలనూ గుర్తించవచ్చు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించు'' అన్నాడు.

అంత మంచి ఉపాయం చెప్పినందు కాయన్ని వ్యంగ్యంగా మెచ్చుకున్నాడు సోమలింగం. ''నాకు పొగడ్తలు వద్దు నాయనా. ఇప్పటికి మనం ఆరు నిముషాల పన్నెండు సెకండ్లు మాట్లాడేం. సెకనుకు పది రూపాయల చొప్పున లెక్క బిల్లు పంపిస్తాను. నా శిష్యుడు వస్తాడు. డబ్బు సిద్ధంగా వుంచు'' అన్నాడు సర్వజ్ఞయోగి. విధానాలనుబట్టి పార్టీలను గుర్తించడం సాధ్యంకాదని చెప్పాలనుకున్న సోమలింగం తక్కున ఫోను పెట్టేసాడు.

ద్వితీయ ప్రయత్నంలో ఆయనకు భరత్ దొరికాడు. ''నా గురించి వార్తలున్న పాత దినపత్రికలు పంపు. చాలా అర్జంటు'' అన్నాడు సోమలింగం.

''లాభంలేదు. మీ ఇంటికే రూట్లో దినపత్రికలు బయలుదేరినా అవి తనవేనని దారి కాసేసి లాగేసుకుంటున్నాడు షావుకారు. మీరే ఇక్కడకు రండి'' అన్నాడు భరత్.

షావుకారుమీద కోప్పడితే ఇల్లాలిమీద కోప్పడినంత ప్రమాదమని భయపడి ''మరి నేను ఎంపీనికదా. పత్రికాఫీసుకొస్తే హడావుడికదా'' అన్నాడు అనుమానంగా.

''అబ్బే-తెలుగువాళ్లు సినిమాల్లో అరక్షణం కనిపించే ఎక్స్‌ట్రాని అతి సులభంగా గుర్తుపడతారు కానీ ఎంపీల మొహాలు ఓటేసేటప్పుడే పట్టించుకోరు'' అని హామీ ఇచ్చాడు భరత్.

సోమలింగం చిన్నబుచ్చుకున్నాడు. అయినా తన భయం తనది కాబట్టి కార్లో వెళ్లకూడదనుకున్నాడు. రోడ్డుమీదకు వస్తే ఒక్కరూ ఆయన్ను పట్టించుకోరు. ఆటోని పిలిస్తే మీటరు మీద రెండ్రూపాయలు కావాలని ఆయన్ని అతి సామాన్యుడిలా ట్రీట్ చేసాడు. మొత్తం మీద ఆయన ''నిజం వినడమంటే అనుభవించడం మరింత ఘోరం'' అని మనసులో అనుకుని పత్రికాఫీసుచేరి అక్కడ భరత్ వుంచిన పేపర్లు తిరగేస్తే ఒక్కొక్క వార్తలో ఒకో నాయకుడ్ని పొగిడి మరో నాయకుడ్ని తిడుతున్నాడు. పేపర్లన్నీ తిరగేసరికి పెర్ముటేషన్, కాంబినేషన్లన్నీ అయిపోయాయి. చివరికి విసుగ్గా ''ఇన్నిచోట్ల నా పేరు ముందు ఎంపీ అని వ్రాసారేతప్ప ఒక్కచోటా నా పార్టీ పేరు వేయలేదేం?'' అన్నాడు.

''ఎంపీ కావడానికే పార్టీలు. ఎంపీలకు పార్టీలుండవు. ఇది రూఢీ అయినప్పట్నించీ జర్నలిస్టులం ఎంపీల పార్టీలు వేయడం మానేసాం. అసలు మా జర్నలిస్టుల్లో ఓ జోక్ కూడా వుంది. ఏ ఎంపీకైనా నీ పార్టీ ఏమిటని అడిగితే చెప్పగలడా అని'' అన్నాడు భరత్.

సోమలింగం ఇబ్బందిగా నవ్వేసి భరత్ నిజంగానే తనని పార్టీ గురించి అడుగుతాడని భయపడి వెంటనే అక్కడ్నుంచి కదిలాడు. ఇల్లు చేరక తన పార్టీ ఏమిటా అని కాక పార్టీ ఏమిటో ఎలా తెలుసుకోవాలో అని తీవ్రాలోచనలో పడ్డాడు.

బాగా ఆలోచించగా ఓ ఉపాయం తట్టి ఢిల్లీలో స్పీకర్‌కు ఫోన్ చేసాడు. అదృష్టం కొద్దీ ఆయన వెంటనే దొరికాడు. సోమలింగం ప్రశ్న విని ''తప్పు తప్పు. నీ పార్టీ ఏదో నువ్వే చెప్పాలి. నేను వినాలి. నీ పార్టీ పేరు నేను చెప్పాలంటే మనమిద్దరం గుజరాత్‌లో పుట్టి వుండాల్సిందేమో'' అని ఫోన్ పెట్టేసాడు.

సోమలింగం ఢిల్లీలో మరికొందరికి ఫోన్లు చేసాడు. పార్లమెంటులో ఓటింగు జరగాల్సిన తీర్మానాలేవీ ఇప్పట్లో లేవుట. అందుకని ఎవరూ ఎంపీల గురించి బొత్తిగా పట్టించుకోవడంలేదు. మెజారిటీ లేకుండానే నిక్షేపంలా ఓ కూటమి దేశాన్నేలేస్తుంటే మెజారిటీకి దగ్గర్లో వున్న పార్టీకి ఒకరూ ఇద్దరూ చాలని పరిస్థితి. ''పీవీ టైములో ఎంత బాగుండేది? ఏ ఎంపీకా ఎంపీకి విడివిడిగా విలువుండేది'' అని గత వైభవం తల్చుకుని ఓ క్షణం బాధపడ్డాడాయన. అంతలో ఆరువారాలు క్రితం ఓ పెద్దాయన పెద్ద పార్టీ నుంచి విడిపోయి కొత్త పార్టీ పెడతానని ప్రకటించాడని గుర్తుకొచ్చి తనుగానీ ఆయన పార్టీలో చేరాడా అని అనుమానం కలిగి ఫోన్ చేస్తే ''అలూలేదూ చూలూలేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లు నా పార్టీకే ఇంకా పేరులేదు. అందులో నీ పేరా?'' అన్నాడాయన.

తన పేరు అలాంటి సామెతలో వున్నందుకు నొచ్చుకోబోగా ఇంట్లో పెద్ద హడావుడి. ఆయన భార్య వున్నట్టుండి డోక్కుంది. అందుకు కారణం అదేనట. సోమలింగం వెంటనే మరాలోచన లేకుండా భార్య పొట్టకు చెవులానించి ''గుర్రంలాంటి నా భార్య కడుపులో వున్న పిల్లా నా పార్టీ పేరేంటో చెప్పగలవా?'' అనేసాడు. తన కథకు అంతకు మించి ముగింపు వుండదన్న భావనలో.

అప్పుడు ''ఈహిహిహి'' అన్న సకిలింపు వినిపించింది. కానీ అది తన భార్య పొట్ట నుంచీ కాక నోట్లోంచి వచ్చింది. ఎందుకల్లా నవ్వుతావని అడగబోయి, ఆమె అలాగే నవ్వుతుందని గుర్తొచ్చి, ఇన్ని గుర్తొస్తున్నాయి, నా పార్టీ పేరెందుకు గుర్తురాదు అని మదన పడిపోయాడాయన.

అంతలో అలా వచ్చిన పుత్రరత్నం ''నాన్నా! రేపటికి హోంవర్కు చేసుకోవాలి. నా పుస్తకాల సంచీ ఎక్కడో పోయింది. కొత్త పుస్తకాలు కొనాలి. అర్జంటు'' అన్నాడు.

''అమ్మనడిగి డబ్బు తీసుకో'' అన్నాడు సోమలింగం విసుగ్గా.

''డబ్బు గురించి కాదు. నేనే క్లాసో మరచిపోయాను'' అన్నాడు పుత్రరత్నం.


సోమలింగం వాడిని తిట్టాడు. అవన్నీ తనకే తగులుతున్నట్లు తోచి తగ్గిపోయి ''ఏదైనా పాఠం గుర్తు చేసుకో'' అన్నాడు.

''నాకు ఈగ పాఠమొక్కటే గుర్తు. ఈగ మురికిమీద వాలి అక్కడ అనారోగ్యాన్ని అన్ని చోట్లకూ పాకించడానికి వాలిన చోట వాలకుండా మారుతూ..'' అని వాడు పాఠం గుర్తు చేసుకోబోతుంటే భరించలేక ''ఆగు'' అన్నాడు. అంతలోనే జేబులోని సెల్యులార్ పలికింది. అప్పుడే సాయంత్రమైపోయిందా అనుకుంటూ అవతలి పార్టీ సందేశం విని ''కోటి రూపాయలకు పైసా తగ్గను. పది లక్షలకింకెవరైనా దొరికితే చూసుకోండి'' అన్నాడు.

''ఒరినీ! ఫలానా పార్టీ వాడిక్కూడా ఇంత రేటా? ఏదో నోరు జారిందిగానీ పదిలక్షలిస్తామనడమే మా బుద్ధి తక్కువ. నీ నోట్లో శని వుండి మంచి బేరం పోగొట్టుకున్నందుకు విచారిస్తావులే... బై''

ఫోన్ కట్టయింది. అవతలివాడు 'ఫలానా' అంటూ సోమలింగం పార్టీ పేరు చెప్పనే చెప్పాడు. అ పేప్పుదేదో ముందే చెబితే కోటి అడిగేవాడ్ని, పదిలక్షలు పోగొట్టుకునేవాడ్ని అని నొచ్చుకుంటూ ఏదేమైతేనేం తన పార్టీ పేరు తెలిసిందని తృప్తిపడ్డాడు సోమలింగం. అదెంతసేపు గుర్తుంటుందో మాత్రం ఆయనకే తెలియదు.

★



## అంబిక ఆగమనం!

**ఒకప్పుడు దక్షిణాది భాషా చిత్రాలన్నిటిలోనూ హీరోయిన్‌గా నటించిన మలయాళీ అమ్మాయి అంబిక పెళ్లి చేసుకుని సినిమాలకి గుడ్ బై చెప్పేసింది. ఆ తరువాత ఆమె చెల్లెలు రాధ కూడా పెళ్లి చేసుకుని సినిమాలకు స్వస్తి పలికింది. దాదాపు ఏడెనిమిదేళ్ల తరువాత అంబిక తిరిగి ఇప్పుడు సినిమాల్లో నటించడానికి వచ్చిం ది. ఆమె నటించిన 'అరుణాచలం' ఇటీవలే విడుదలైంది. అయితే ఇందులో ఆమె పాత్ర మరీ చిన్నది. కొన్ని సెకన్లు మాత్రమే కనిపించే పాత్ర. అంబిక నటిస్తున్న మరో సినిమా 'మేధావి'. ఇందులో ఆమె తమ్ముళ్ళు స్వాతో కలిసి కనిపిస్తుంది. అక్క అంబిక లాగే చెల్లెలు రాధ కూడా చిత్రాల్లోకి తిరిగి వస్తుందేమో చూడాలి!**

-జి.ఎం.